క్లుప్తంగా

చిన్నారుల తల్లులకు వంటల పోటీలు



ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): స్థానిక సచివాలయ ఆవరణలో పోషణ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా చిన్నారుల తల్లులకు శుక్రవారం వంటల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గూడపాటి లావణ్య మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే వైఎస్సార్ కిట్స్, పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకుని తల్లీపిల్లలు ఆరోగ్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు గూడపాటి రవికుమార్, పంచాయతీ కార్యదర్శి నరేష్, ఆరోగ్య సిబ్బంది ప్రభావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు ధనలక్ష్మి, నిర్మల, జ్యోతి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా పుష్పయాగం



నందిగామ: పట్టణంలోని సీతారామాంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం స్వామికి పుష్పయాగం నిర్వహించారు. శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా స్వామికి వేకువ జామున ప్రత్యేక పూజలు జరిగాయి. పట్టణానికి చెందిన అయ్యప్ప సేవా సంఘం నిర్వాహకులు మహంకాళి వెంకన్న గురుస్వామి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వినియోగం జరిగింది.

సామూహిక కుంకుమ పూజలు



నందిగామ: పట్టణ శివారు అనాసాగరం భక్తాంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో ఆలయంలో నాలుగు రోజులుగా ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమాలలో భాగంగా చివరి రోజు ఆలయంలోని భక్తాంజనేయ స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం జరిగిన సామూహిక కుంకుమ పూజల కార్యక్రమంలో గ్రామానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆ తర్వాత ధార్మిక మండలి సభ్యులు హుస్సేన్ రావు, అశోక్, పుల్లారావును ఆలయ నిర్వాహకులు సత్కరించారు.

ముగిసిన పేట బార్ అసోసియేషన్ ఎన్నికలు



జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులకు జరిగిన ఎన్నికలు ముగిశాయి. శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నానికి ముగిసింది. అధ్యక్ష పదవికి అన్నెపాక కాంతారావు, అన్నెపాక సుందరరావు పోటీ పడగా, కాంతారావు 10 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అలాగే జనరల్ కార్యదర్శి పదవికి యలమంచి నాగ రాజేంద్రప్రసాద్, మెట్టెల వీరాంజనేయులు పోటీ పడగా, వీరాంజనేయులు గెలుపొందారు. ఎన్నికల అధికారులుగా కొల్లి స్టాలిన్, జి.వెంకటేశ్వర్లు, కె.శ్రీనివాసరావు వ్యవహరించారు.

విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులు అందజేత



కంచికచర్ల: త్వరలో జరగనున్న పదోతరగతి పబ్లిక్‌పరీక్షలు విద్యార్థులు ఎటువంటి ఆందోళనకు గురికాకుండా ప్రశాంత వాతావరణంలో రాయాలని వైస్ ఎంపీపీ బండి మల్లికార్జునరావు అన్నారు. మండలంలోని మోగులూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పదో తరగతి విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్‌లు, స్కేళ్లు, పెన్సిళ్లను సొంత నిధులతో పంపిణీ చేశారు. ఈ మేరకు బండి మాట్లాడుతూ తను 13 ఏళ్ల నుంచి పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల సమయంలో అవసరమైన పరికరాలను అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాంబాబు, ఉపాధ్యాయులు గంగాధర్, రవికుమార్ పాల్గొన్నారు.

ఈదురు గాలులతో కూడిన వర్షం



కంచికచర్లలో కురిసిన వర్షానికి జలమయమైన జుజ్జూరురోడ్డు

కంచికచర్ల: కంచికచర్లలో శుక్రవారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. స్థానిక నెహ్రూబొమ్మ సెంటర్, ఆర్టీసీ బస్టాండ్‌లో వర్షపునీరు పారుదల కాక ఎక్కడికక్కడే అక్కడ నిలబడి ఉన్నాయి. డ్రెయినేజీల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించకపోవడంతో రోడ్డుపై మురుగునీరు నిలబడి పోయింది. కార్లు, ద్విచక్రవాహనదారులు రోడ్లుపై నిల్వ ఉన్న వర్షపు నీటి వల్ల గోతులు కనపించకపోవడంతో గోతుల్లో పడిపోతామేమోనని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వాహనాలు నడిపారు. రెండు స్కూటీలు మాత్రం గొట్టుముక్కల రోడ్డు సెంటర్‌లో గోతుల్లో ఇరుక్కుపోయాయని స్థానికులు తెలిపారు. జుజ్జూరు రోడ్డులో రోడ్డు పక్కన కూరగాయల దుకాణాలపై ఫ్లెక్సీ బోర్డు పడిపోయింది. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

పిడుగుపాటుతో వ్యక్తికి తీవ్ర గాయాలు

అల్లూరు(వీరులపాడు): మండలంలో శుక్రవారం కురిసిన ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి పిడుగు పడి వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. సేకరించిన సమాచారం మేరకు మండలంలోని అల్లూరు గ్రామానికి చెందిన వెల్లంకి వెంకటరామిరెడ్డి రోజూ మాదిరిగా తన పొలానికి వెళ్లాడు. పొలంలో పని చేస్తుండగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈ క్రమంలో పిడుగు పాటుకు గురవడంతో వెంకటరామిరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు హుటాహుటిన నందిగామ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్య నిమిత్తం విజయవాడకు తరలించారు.

ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం

వీరులపాడు: మండలంలో శుక్రవారం ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు భానుడు విజృంభించినప్పటికీ ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై వర్షం కురిసింది. ఇప్పటికే మొక్కజొన్న రైతులు కొందరు పంటను కోసి కల్లాల్లో ఎండబెట్టారు. ఆరుగాలం కష్టించి పండించి కల్లాల్లో ఆరబెట్టిన పంటను పట్టాలు కప్పి కాపాడుకునేందుకు రైతులు ఉరుకులు పరుగులు పెట్టారు. ఇదిలా ఉంటే కోత దశకు వచ్చిన మొక్కజొన్న ఈదురుగాలులకు నేలమట్టమైందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

పిడుగుపాటుకు గడ్డివామి దగ్ధం

నందిగామ: నందిగామ ప్రాంతంలో శుక్రవారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఆకాశం మేఘావృతమై పట్టణాన్ని చీకట్లు కమ్మేసాయి. చిరుజల్లులు కురిసాయి. ఆ సమయంలో మండలాల్లోని పలు ప్రాంతాలలో పిడుగులు పడ్డాయి. మండలంలోని సోమవరం గ్రామంలో ఓ తాటి చెట్టు పై పిడుగు పడింది. దీంతో పక్కనే ఉన్న శ్రీనివాసరావుకు చెందిన రెండు ఎకరాల లోని వరిగడ్డి వామి కి నిప్పు అంటుకుంది. వెంటనే గమనించిన స్థానికులు ఫైర్ అధికారులకు సమాచారమిచ్చారు. స్పందించిన ఫైర్ అధికారులు మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.



కంచికచర్ల జుజ్జూరు రోడ్డులో కూరగాయల దుకాణాలపై పడిన ఫ్లెక్సీ బోర్డు



మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

వర్షంతో రైతుల ఆందోళన



పెనుగంచిప్రోలులో మిర్చి కల్లాలపై కప్పిన పట్టాలపై చేరిన వర్షం నీరు



పెనుగంచిప్రోలు వద్ద నేలవాలిన మొక్కజొన్న

పెనుగంచిప్రోలు: మండలంలో శుక్రవారం సాయంత్రం వర్షం పడటంతో రైతులు పొలాలకు పరుగులు తీశారు. కల్లాల్లో ఆరబోసిన మిర్చి పంటను కాపాడుకునేందుకు రైతులు పట్టాలు కప్పుకున్నారు. ఈ ఏడాది మండలంలో ఆరు వేల ఎకరాల్లో మిర్చి, 900 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. మరో నాలుగు రోజుల పాటు వర్షాలు పడే అవకాశం ఉందని చెబుతున్న తరుణంలో మిర్చి రైతులు కల్లాల్లో మిర్చి రాశులపై పట్టాలు కప్పుకోవడంతో పాటు కోతలు కొద్ది రోజులు వాయిదా వేసుకోవాలని ఏఓ రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. కాగా కోతకు సిద్ధంగా ఉన్న మొక్కజొన్న నేలవాలింది. మామిడి కాయలు కూడా అక్కడక్కడా రాలాయి.

మిర్చి దొంగల అరెస్టు

వత్సవాయి: రాత్రి సమయాల్లో కల్లాల్లో ఆరబోసిన మిర్చి పంటను దొంగిలిస్తున్న నలుగురు వ్యక్తులను పోలీసులు శుక్రవారం అదుపులోనికి తీసుకున్నారు. ఎస్సై అభిమన్యు తెలిపిన వివరాల మేరకు గుంటూరు జిల్లా పిడుగురాళ్ల, సూర్యాపేట జిల్లా కోదాడ, నల్గొండ జిల్లా నల్గొండకు చెందిన నలుగురు వ్యక్తులు ముఠాగా ఏర్పడి రాత్రి సమయాల్లో మిర్చిని దొంగిలిస్తున్నారు. మండలంలోని చిట్టేల గ్రామంలో 12 క్వింటాళ్లు, దబ్బాకుపల్లిలో రెండు క్వింటాళ్లు, పెనుగంచిప్రోలు మండలం లింగగూడెంలో 12, ముచ్చింతాలలో తొమ్మిది క్వింటాళ్ల మిర్చిని దొంగిలించినట్లు ఎస్సై తెలిపారు.

పోక్సో కేసు నమోదు

వత్సవాయి: బాలికను మోసం చేసి గర్భవతిని చేసిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి.అభిమన్యు శుక్రవారం తెలిపారు. గ్రామానికి చెందిన ఎస్‌కే సుభానీ అనే వ్యక్తి తన ఇంటి సమీపంలోనే ఉన్న బాలికపై గత ఆరు నెలల నుంచి మాయమాటలతో లోబర్చుకున్నాడు. ఇటీవల బాలికకు కడుపులోనొప్పి వస్తుండడంతో తల్లిదండ్రులు వైద్యశాలకు తీసుకెళ్లారు. వైద్యులు ఆ బాలిక ఐదు నెలల గర్భిణి అని నిర్ధారించారు. దీంతో కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సుభానీని అదుపులోనికి తీసుకుని కేసు నమోదు చేశారు.

గాయపడ్డ వ్యక్తికి ఆర్థిక సాయం

నందిగామ: ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తికి కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్ శుక్రవారం రూ.10,000 సాయం చేశారు. మండలంలోని గోళ్లమూడి గ్రామానికి చెందిన షేక్ బాబు సాహెబ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ నేపథ్యంలో ఆయనకు ఆర్థిక సాయాన్ని అందజేసినట్లు రవిశంకర్ తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కొల్లూరు ఉమామహేశ్వరరావు, చెరుకూరి రమేష్, కొలకలూరి వెంకటేశ్వరరావు, నాదెండ్ల నాని తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేలో కచ్చితమైన కొలతలతో హద్దు రాళ్లు

తహసీల్దార్ రాజకుమారి



పరిటాలలో హద్దు రాళ్లను దగ్గరుండి పాతిస్తున్న తహసీల్దార్

కంచికచర్ల: వందేళ్ల క్రితం నాటి భూముల్లో జనగనన్న భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా ప్రభుత్వం రీ సర్వే చేపట్టి అనతికాలంలో కచ్చితమైన కొలతలు, హద్దులతో సర్వే హద్దు రాళ్లను పాతుతున్నామని తహసీల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి అన్నారు. మండలంలోని పరిటాలలో శుక్రవారం ప్రభుత్వ, ప్రైవేటు భూములను రీ సర్వే చేసి ఆ భూముల్లో ప్రభుత్వం పంపిణీ చేసిన సరిహద్దు రాళ్లను పాతారు. ఈ మేరకు తహసీల్దార్ మాట్లాడుతూ రైతులు పొలానికి భూ హక్కు పత్రంతో హాజరుకావాలని కోరారు. స్టోన్ ప్లాంటేషన్ వచ్చే నెల ఏప్రిల్ 15వ తేదీలోగా సరిహద్దురాళ్లను పాతేలా తగు చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు, కౌలురైతులు తమ సిబ్బందికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో డీటీ నాగుల్‌మీరా, ఆర్‌ఐ శిరీష, వీఆర్వోలు వేముల ప్రదక్షిణరావు, వేల్పుల జనార్దన్, సర్వేయర్ బసవరావు పాల్గొన్నారు.

బియ్యం నిల్వల పరిశీలన

కంచికచర్ల: పేదలకు పంపిణీ చేసే బియ్యం, నిత్యావసర సరుకులు కందిపప్పు, పంచదార నిల్వల్లో ఎటువంటి అవకతవకలు లేకుండా చూడాలని తహసీల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో ఉన్న పౌర సరఫరా ఎంఎల్‌ఎస్ పాయింట్‌ను శుక్రవారం వార్షిక తనిఖీలో భాగంగా పరిశీలించారు. ముందుగా ఆన్‌లైన్‌లో నిల్వ ఉన్న సరుకులను పరిశీలించారు. గోదాములో ఉండాల్సిన పీడీఎస్ బియ్యం 68.919 మెట్రిక్ టన్నుల బియ్యం, మధ్యాహ్న భోజనం, అంగనవాడీ కేంద్రాలకు పంపిణీ చేసే ఫోర్టిఫైడ్ బియ్యం 49.119 మెట్రిక్ టన్నులు ఉన్నాయా లేవాని పరిశీలించామన్నారు. అన్నీ సక్రమంగా ఉన్నాయని ఎంఎల్‌ఎస్ పాయింట్ నుంచి జీపీఎస్ సిస్టం ద్వారా నేరుగా రేషన్‌దుకాణాలకు బియ్యం సరఫరా అవుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో గోదాము ఇన్‌చార్జి సత్యశ్రీ, ఆర్‌ఐ శిరీష పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపకరణాలు అందజేత

నందిగామ: పదో తరగతి విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్ అన్నారు. మండలంలోని మాగల్లు గ్రామంలో గల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పరీక్షలకు ఉపయోగపడే ప్యాడ్, పెన్, పెన్సిల్, రబ్బర్ లాంటి ఉపకరణాలను శుక్రవారం ఆయన విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు 10వ తరగతి పరీక్షలు ఎంతో కీలకమైనవని, వాటిని విద్యార్థులు బాగా రాసి మంచి మార్కులు తెచ్చుకోవాలన్నారు.

పారిశుద్ధ్యంపై అప్రమత్తంగా ఉండాలి

మున్సిపల్ కమిషనర్



పారిశుద్ధ్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న కమిషనర్

నందిగామ: పారిశుద్ధ్యం విషయంలో సిబ్బంది అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం పేర్కొన్నారు. పట్టణంలోని ఎనిమిదో వార్డు పరిధిలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను శుక్రవారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలు నగర పంచాయతీ సిబ్బందికి సహకరించాలన్నారు. ఆయన వెంట వార్డు ఇన్‌చార్జి గుడివాడ సాంబశివరావు, పలువురు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చురుగ్గా భూముల రీ సర్వే

వీరులపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో జరుగుతున్న జగనన్న శాశ్వత భూహక్కు–భూ రక్ష పథకం ద్వారా చేపడుతున్న భూముల రీ సర్వే పనులు చురుగ్గా సాగుతున్నాయని తహసీల్దార్ ఆశయ్య నాయక్ పేర్కొన్నారు. మండలంలోని వీఅన్నవరం, దొడ్డదేవరపాడులో జరుగుతున్న రీ సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంద ఏళ్ల తరువాత ప్రభుత్వం భూముల రీసర్వే నిర్వహిస్తుందన్నారు. ముఖ్యంగా రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సిబ్బంది సర్వే చేయాలని సూచించారు. రైతులు కూడా సర్వే సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు జమ్ముల వరబాబు, రామకృష్ణ, కన్నమాల సురేష్‌బాబు, డిప్యూటీ తహసీల్దార్ అంజనేయులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

సైన్స్ పితామహుడు న్యూటన్ వర్ధంతి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): భౌతిక, గణిత, ఖగోళ శాస్త్రవేత్త ఐజాక్ న్యూటన్ వర్ధంతి జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కొండపల్లిలో శుక్రవారం నిర్వహించారు. జేవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు పి.కామేశ్వరరావు మాట్లాడుతూ ప్రకృతి సిద్ధమైన తత్వశాస్త్రం సైన్స్‌గా పరిణామం చెందేందుకు ఐజాక్ న్యూటన్ ఎంతగానో కృషి చేశారన్నారు. ఆధునిక ప్రపంచం న్యూటన్‌ను సైన్స్ పితామహుడిగా గౌరవిస్తోందన్నారు. న్యూటన్ తన గ్రంథాల్లో గురుత్వాకర్షణ శక్తి గురించి ప్రస్తావించినట్లు తెలిపారు. ఐజాక్ న్యూటన్‌పై డాక్యుమెంటరీ ప్రదర్శించారు. కొండపల్లి శాఖ అధ్యక్ష కార్యదర్శులు సర్దార్ సాహెబ్, ఎస్.నాగరాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల నిరసన

నందిగామ: కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీపై లోక్ సభలో అనర్హత వేటు విధించడాన్ని నిరసిస్తూ శుక్రవారం నందిగామ పట్టణంలో ఆ పార్టీ నాయకులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఆదేశాల నేపథ్యంలో ఈ కార్యక్రమం జరిగిందని స్థానిక నాయకులు తెలిపారు. ప్రధాని కుంభకోణాలపై పార్లమెంటులో నిలదీసినందుకే రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులు కర్ల శ్యామ్, కామా శ్రీనివాసరావు, గింజుపల్లి అనిల్‌కుమార్, కనకపూడి వెంకటేశ్వరరావు, వేల్పుల శ్రీహరి పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయండి

ప్రభుత్వ విప్ ఉదయభాను



బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: మండలంలోని తిరుమలగిరిలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 5 నుంచి 10వ తేదీ వరకు జరుగు బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను తెలిపారు. ఉదయభాను నివాసంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో తిరుమలగిరి దేవస్థానం బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్లను దేవస్థాన కమిటీ వారు, అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవస్థాన పాలక మండలి సభ్యులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఆకాంక్షించారు. తిరుమలగిరి దేవస్థాన పాలకవర్గ అధ్యక్షుడు పసుపులేటి రాధా సుబ్రహ్మణ్యేశ్వరరావు మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలలో ఐదో తేదీన అంకురారోహణ, 6న స్వామి కల్యాణ మహోత్సవం, 7న రథోత్సవం, 8న సదస్యము, 9న పూర్ణాహుతి, 10న స్వామి వారి పవళింపు సేవ తదితర పూజాది కార్యక్రమాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో దేవస్థాన పాలకవర్గ సభ్యులు, అసిస్టెంట్ కమిషనర్ డీఎస్.వరప్రసాదరావు పాల్గొన్నారు.

రోడ్లు, డ్రెయిన్లు పరిశుభ్రంగా ఉంచాలి

మున్సిపల్ కమిషనర్



శానిటరీ మేస్త్రులకు ఆదేశాలు జారీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ మల్లేశ్వరరావు

జగ్గయ్యపేట అర్బన్: స్వచ్ఛ జగ్గయ్యపేట కార్యక్రమంలో భాగంగా పట్టణంలో డ్రెయిన్లను పరిశుభ్రంగాను, రోడ్ల వెంబడి చెత్త నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు పరిశీలించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్, శానిటరీ మేస్త్రులకు, సచివాలయ శానిటేషన్ సెక్రటరీలకు మున్సిపల్ కమిషనర్ మల్లేశ్వరరావు ఆదేశాలు జారీ చేశారు. పురపాలక సంఘ పరిధిలోని బుద్ధుని విగ్రహం, మున్సిపల్ పార్కు, జిమ్, ఆయా వార్డుల్లో పారిశుద్ధ్య పనులను కమిషనర్ శుక్రవారం పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ వీధుల్లో, గృహాలలో సేకరించిన చెత్తను విధిగా డంపింగ్ యార్డుకు తరలించాలని ఆదేశించారు. రోడ్ల మధ్యలో ఉన్న డివైడర్లపై అతికించిన పోస్టర్లను, కాయితాలను తొలగించాలని ఆదేశించారు. ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు అమ్మేవారిని గుర్తించి, వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజలు చెత్తను రోడ్ల వెంబడి పడవేయరాదని, పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు తమ వంతు సహకారాన్ని అందించాలని కోరారు.

రైతుల సేవలో కేడీసీసీ

కేడీసీసీ బ్యాంకు చైర్మన్ తన్నీరు



గోదాము నిర్మాణ శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కేడీసీసీ బ్యాంకు చైర్మన్ తన్నీరు

మక్కపేట(వత్సవాయి): రైతులకు సకాలంలో కావల్సిన రుణాలను అందించడంలో కృష్ణా జిల్లా సహకార కేంద్రబ్యాంకు ఎప్పుడూ ముందుంటుందని బ్యాంకు చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు తెలిపారు. కేడీసీసీ నిధులు రూ.22.25 లక్షలతో సొసైటీకి అనుసంధానంగా గోదాము నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కంటే సొసైటీల ద్వారా రైతులకు కావాల్సిన రుణాలను సకాలంలో వారికి అందించడం జరుగుతుందని తెలిపారు. ఎకరానికి రూ.6 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు రుణాలను ఇస్తున్నట్లు తెలిపారు. గృహ, వ్యాపార, విద్యా రుణాలను కూడా ఇస్తున్నామన్నారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించినట్లయితే రాయితీలు కూడా వర్తిస్తాయన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కొండబోలు బ్రహ్మం, సర్పంచ్ గుడేటి శారమ్మ, జెడ్పీటీసీ యేశపోగు దేవమణి, వత్సవాయి, పోలంపల్లి, గోపినేనిపాలెం సొసైటీ అధ్యక్షుడు రంగిశెట్టి ముత్తయ్య, కాటేపల్లి రవి, కట్టా శ్రీనివాసరావు, ఏఎంసీ డైరెక్టర్ పండగ శ్రీను పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలి



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: ఎండాకాలంలో పాదచారులు, వాహనదారుల దాహార్తిని తీర్చేందుకు పట్టణంలో చలివేంద్రాలు ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో కఠారి బ్రదర్స్, చింతా వారి బ్రదర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఉదయభాను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులు, పాదచారుల దాహార్తిని తీర్చేందుకు బస్‌స్టాండ్ వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటుచేయడం సంతోషదాయకమని కఠారి బ్రదర్స్‌ను అభినందించారు. అలాగే పక్కనే మినీ పార్కులో ఉన్న పట్టణ మాజీ సర్పంచ్ సామినేని విశ్వనాథం విగ్రహానికి నివాళులర్పించారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, వైఎస్సార్ సీపీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు ఆవాల భవానీప్రసాద్, చలివేంద్రం నిర్వాహకులు కఠారి హరిబాబు, చింతా మధు, శివానీ దంపతులు, వైఎస్సార్ సీపీ మైనార్టీ, ఎస్టీ విభాగాల అధ్యక్షుడు మొహిద్దీన్, బద్దూనాయక్, కౌన్సిలర్లు వట్టెం మనోహర్, గింజుపల్లి వెంకట్రావు, పందుల రోశయ్య, దువ్వల రామకృష్ణ, తన్నీరు నాగేంద్ర, పూసల పుల్లారావు, నాయకులు ఫిరోజ్‌ఖాన్, ఎస్ఎస్పీ సైదా, షేక్ ఖాజా పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రభాకర్

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని 25వ వార్డు క్రిస్టియన్‌పేటకు చెందిన కత్తుల ఉప్పలమ్మ గత కొంతకాలంగా అనారోగ్యంతో ఉంటూ గురువారం మృతి చెందింది. దీంతో ఆమెకు మంజూరైన వైఎస్సార్ బీమా పథకానికి సంబంధించి ముందుగా మట్టి ఖర్చులు కింద రూ.10 వేలను శుక్రవారం మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ మృతురాలి కుమార్తె కౌసల్యకు అందజేశారు. డెత్ సర్టిఫికెట్ వచ్చిన వెంటనే మిగతా డబ్బులు నామిని ఎకౌంట్‌లో జమ అవుతాయని పేర్కొన్నారు.

ఘనంగా రథోత్సవం

గంపలగూడెం: గంపలగూడెం సీతారామస్వామి ఆలయ బ్రహ్మోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం రాత్రి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. నూతన వధూవరులైన సీతారామచంద్రుల ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఉంచి గ్రామంలోని ప్రధాన వీధుల వెంట అట్టహాసంగా ఊరేగించారు. ముందుగా ఆలయ అర్చకులు దేవయజనం శ్రీధర్ ఆచార్యులు అర్చక బృందంచే విశేష పూజలు జరిపారు. రథోత్సవం ముందు గంపలగూడెంకు చెందిన మహిళలు ప్రదర్శించిన కోలాటం అలరించింది. వైస్ చైర్మన్ కూన కోదండరాం, భక్తులు విశేషంగా పాల్గొన్నారు.